సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం
పర్మినెంట్ లోక్ అదాలత్ (పీఎల్ఏ) ద్వారా సత్వర న్యాయ పరిష్కారం పొందవచ్చని కడపలోని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ పేర్కొన్నారు. - 8లో



వివాహానికి వెళ్తుండగా విషాదం
వివాహ ప్రయాణం విషాదంగా మారింది. రెండు బస్సులు ఢీకొనడంతో నాగసుబ్బారెడ్డి(47) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. సుమారు 10 మందికి గాయాలయ్యాయి. - 8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
27.1 /22.9
జిల్లాలో శనివారం 22.9 - 27.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు అవగాహన సదస్సు

కడప ఎడ్యుకేషన్ : కడప ఎన్‌జీవో భవన్‌లో నేడు (ఆదివారం) ఉదయం 10 గంటలకు డిపార్టుమెంట్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర జిల్లా నాయకులు సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి, అలీఖాన్, ఈశ్వరచంద్ర, వీరప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజగోపాల్, సత్యనారాయణ తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాసులు హాజరవుతున్నట్లు చెప్పారు. డిపార్ట్‌మెంట్ పరీక్షలకు సంబంధించిన బిట్స్, బుక్లెట్లు, కంప్యూటర్ బెస్డ్ పరీక్ష రాసే విధానం , కరదీపిక, మోడల్ పేపర్ల అందుబాటులో ఉంటాయన్నారు. కావున అన్ని శాఖల ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరు కావాలని, తమ అనుమానాలను నివృత్తి చేసుకోలని కోరారు.

రేపు 'స్పందన' రద్దు

కడప సెవెన్‌రోడ్స్ : సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేశామని కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ప్రారంభించనున్నారని చెప్పారు. అందుకే 'స్పందన'ను రద్దు చేస్తున్నామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

18న ఆరోగ్య శ్రీ కార్డులు

కడప రూరల్ : డాక్టర్ వైఎస్సార్ ఆరగ్యో శ్రీ కొత్త కార్డుల పంపిణీ కార్యక్రమం ఈ నెల 18వ తేదీన జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. నూతన కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష-2లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొత్త కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఇందులో భాగంగా దశల వారీగా ఆరోగ్య కార్యకర్తలు, సీహెచ్‌ఓలు, వలంటీర్‌లు ఇంటింటికీ వెళ్లి కార్డులను పంపిణీ చేస్తారన్నారు.

నేడు బర్సీ మహోత్సవం

కమలాపురం : కమలాపురం పట్టణంలో వెలసిన శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి బర్సీ మహోత్సవం ఆదివారం జరగనుంది. ఈ విషయాన్ని దర్గా నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ యువనేత ఇస్మాయిల్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్వామి వారి భక్తులు, శిష్యులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

18 నుంచి క్రీడా పోటీలు

రాజంపేట : రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 18 నుంచి 20 వరకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డా.వై.సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 26వ ఐపీఎస్‌జీ (ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్)కడప రీజియన్‌కు ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. 13 పాలిటెక్నికల్ కళాశాలకు చెందిన 335 మంది బాలురు పాల్గొంటారని తెలిపారు. అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ తదితర పోటీలు ఉంటాయన్నారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పోటీలు ప్రారంభిస్తారని చెప్పారు.

నూతన కార్యవర్గం



కిశోర్‌బాబు



డి.రాజేంద్రారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీ పీటీడీ నూతన డిపో కమిటీని ఎన్నుకున్నారు. డిపో అధ్యక్షుడిగా కిషోర్ బాబు, సెక్రటరీగా బి.రాజేంద్ర రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి అధ్యక్షత వహించిన నారాయణ, రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ రహమతుల్లాలు కార్మికుల సమస్యలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ డిపో అధ్యక్ష, కార్యదర్శులుగా ఇప్పటివరకు పనిచేసిన లచ్చన్న, రాజేంద్రారెడ్డి సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో గ్యారేజ్ కార్యదర్శి ఖాజా పీర్, ప్రెసిడెంట్ లూర్దు రాజు, వైస్ ప్రెసిడెంట్ శ్రీను, మహిళా సభ్యురాలు నీలేశ్వరి, శివశంకర్, రాధాకృష్ణతో పాటు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా లక్ష్యసాధన

- మన తలరాతను మనమే మార్చుకోవాలి
- అందం, డబ్బు, స్టేటస్‌లను చూసి ఎవరినీ జడ్జ్ చేయకూడదు
- సివిల్స్ ర్యాంకర్ బాలలత
- 'సాక్షి'మీడియా గ్రూపు ఆధ్వర్యంలో గ్రూప్-1, గ్రూపు-2 ఉద్యోగాలపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సివిల్స్ ర్యాంకర్ బాలలత



సదస్సుకు హాజరైన గ్రూప్-1, గ్రూప్-2 అభ్యర్థులు

కడప కార్పొరేషన్ : ప్రణాళికాబద్ధంగా కష్టపడితే లక్ష్యాన్ని సులువుగా సాధించవచ్చని సివిల్స్ ర్యాంకర్, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమి నిర్వాహకురాలు బాలలత అన్నారు. శనివారం కడపలోని హరిత ఫంక్షన్ హాలులో సాక్షిమీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలకు హాజరవుతున్న అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన తలరాతలు మనమే మార్చుకోవాలని చెప్పారు. జీవితంలో గెలుపోటములు సహజమని, పోరాట పటిమ అనేది చాలా ముఖ్యమన్నారు. లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ పోరాడాలని తెలిపారు. పోటీ పరీక్షల్లో ప్రశ్నలు ఎలా వస్తాయి? వాటిని ఎలా పరిష్కరించాలి? టాప్ ర్యాంకు సాధించడం ఎలా? అనే అంశాలపై దృష్టి పెట్టి విజయవంతం కావాలన్నారు. అందం, డబ్బు, స్టేటస్‌ను చూసి ఒక వ్యక్తిని జడ్జ్ చేయకూడదని, వ్యక్తిత్వాన్ని చూసి మాత్రమే నిర్ధారణకు రావాలన్నారు. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలు ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలు అనే మూడు దశల్లో సాగుతాయన్నారు. సమయాన్ని సమన్వయం చేసుకుంటూ ఒకే పంథాలో చదివితే లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుందన్నారు.

సిలబస్‌లో పట్టు సాధించాలి

సిలబస్‌లో మంచిపట్టు సాధించాలని, ఏ స్థాయిలో ఉన్నా చదువు ఒక్కటే మనల్ని ఉన్నత స్థానంలో నిలబెడుతుందన్న విశ్వాసం కలిగి ఉండాలన్నారు. పరీక్షల్లో నెగిటివ్ మార్కింగ్‌ను ఎలా హ్యాండిల్ చేయాలన్న అంశంపై అవగాహన ఉండాలన్నారు. సిలబస్ మ్యాపింగ్, ఏ టాపిక్‌పై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలన్న అంశాన్ని తెలుసుకోవాలన్నారు. సింధు నాగరికత, నగరాలు, అర్బన్ కల్చర్, ఏయే ప్రాంతాల్లో ఏమేం దొరికాయి, బుద్ధిజం, జైనిజం, వాటి టెర్మినాలజీ, స్థూపాలు, జైనమతంలో తీర్థంకరులు, శ్వేతంబరులు, దిగంబరులు వంటి విషయాలను ఉదహరిస్తూ మెలకువలు నేర్పించారు. మెంటల్ ఎబిలిటీ, అర్థమ్యాటిక్స్‌లో బాగా ప్రాక్టీస్ చేస్తే మంచి స్కోర్ సాధించే అవకాశం ఉందన్నారు. గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకుని పరిస్థితులకు రాజీ పడకుండా చదివితే విజయం సొంతమవుతుందన్నారు.

చరిత్ర అధ్యాపకులు రమణయ్య మాట్లాడుతూ గ్రూప్-1, గ్రూప్-2 సిలబస్ తెలుసుకుని దాని ప్రకారమే చదివితే ఉత్తమ ఫలితాలు లభిస్తాయన్నారు. సింధు నాగరికత, ఆర్యుల నాగరికత, వేదాలు, వేదాంగాలు, బౌద్ధమతం, జైన మతం, మౌర్యుడు, గుప్తుడు, హర్షవర్ధనుడు, భక్తి మూమెంట్, సూఫీ ఉద్యమం వంటి వాటిపై ప్రశ్నలొచ్చే అవకాశం ఉందని తెలిపారు. అరుణాచల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నెలకొల్పిన కోటిరెడ్డి మాట్లాడుతూ బాలలత చిన్నప్పటి నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని ఉన్నత స్థానాలకు ఎదిగారన్నారు. తన పిల్లలు అంతా వైద్య రంగంలో స్థిరపడ్డారని, సమాజంలో విద్యార్థులకు ఏదో ఒక విధంగా ఉపయోగపడాలన్నదే తన ఉద్దేశమన్నారు. సాక్షి దినపత్రిక ఎడిషన్ ఇన్‌చార్జి ముజీబుద్దీన్ మాట్లాడుతూ 'సాక్షి'గ్రూపులో అన్ని వర్గాలకు ఉపయోగపడేలా సామాజిక బాధ్యతతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఈ అవగాహన సదస్సు నిర్వహించారన్నారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సరైన గైడెన్స్ లేకపోవడం వల్ల ఫెయిల్యూర్స్‌గా మిగిలిపోతున్నారన్నారు. వారిని మానసికంగా, బలంగా తీర్చిదిద్దేందుకు బాల లత మోటివేషన్ తరగతులు చాలా ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాక్షి బ్రాంచ్ మేనేజర్ హరినాథరెడ్డి, ప్రభుత్వ పురుషుల కళాశాల ఎకనామిక్స్ అధ్యాపకులు బి.విజయ్ కుమార్, కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ గురుమోహన్‌రెడ్డి, డాక్టర్ విజయలక్ష్మిదేవి, నాగవేణి, మంజుల, గ్రూప్-1, గ్రూప్-2 అభ్యర్థులు పాల్గొన్నారు.

అభ్యర్థులను ప్రోత్సహించేలా అవగాహన



సివిల్స్, గ్రూప్-1, గ్రూప్-2 అభ్యర్థులను ప్రోత్సహించే విధంగా అవగాహన సదస్సు ఉంది. బాలలత మేడమ్ చెప్పిన విషయాలు చాలా స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి. రొటీన్‌గా చదువుతూ ఉంటే బోర్ కొడుతుంది. దాని నుంచి బయటపడి ఎలా చదివితే మంచి స్కోర్ చేయవచ్చనే అంశాలపై బాగా వివరించారు.
- విజయలక్ష్మి, ప్రొద్దుటూరు.

కొత్త విషయాలు చెప్పారు



మేము ఇదివరకు వినని కొత్త కొత్త విషయాలను ఈ అవగాహన సదస్సులో తెలుసుకున్నాము. రోజుకు ఎన్ని గంటలు ఎలా చదవాలన్న విషయంపై అవగాహన ఏర్పడింది. గ్రూప్స్ ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు ఇలాంటి అవగాహన సదస్సులు ఏర్పాటు చేసిన సాక్షి యాజమాన్యానికి కృతజ్ఞతలు.
- హిమప్రియ, శ్రీహరి డిగ్రీ కాలేజీ

ఎలా చదవాలో తెలిసొచ్చింది



ఇంతకుముందు గ్రూప్స్‌కు ఎలా ప్రిపేర్ కావాలి, సిలబస్ ఎలా ఉంటుంది, ఏ అంశాలపై ఎక్కువ ప్రశ్నలు అడుగుతారు....అనే దానిపై అవగాహన ఉండేది కాదు. ఈ సదస్సు వల్ల సివిల్స్, గ్రూప్స్‌కు ఎలా చదవాలో తెలిసొచ్చింది. బాగా చదివి గ్రూప్స్‌లో విజయం సాధిస్తామన్న నమ్మకం ఏర్పడింది.
- మానస, గ్రూప్స్ అభ్యర్థి.

అందరిలో ఆత్మవిశ్వాసం ఏర్పడింది



నాది గ్రాడ్యుయేషన్ పూర్తయ్యింది. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాను. గ్రూప్-1, గ్రూప్-2 అభ్యర్థుల కోసం సాక్షి మీడియా అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయం. ఇలాంటి సదస్సులు మరిన్ని నిర్వహిస్తే ఎంతో ఉపయోగం. బాలలత మేడమ్ చెప్పిన విషయాలతో ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసం ఏర్పడింది.
- శ్రీపూజిత, సివిల్స్ అభ్యర్థి.

వ్యవస్థలను మేనేజ్ చేస్తాం

- టీడీపీ రాజంపేట ఎంపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం

కడప కార్పొరేషన్ : రాబోయే ఎన్నికల్లో వ్యవస్థలను మేనేజ్ చేస్తామన్న రీతిలో టీడీపీ రాజంపేట ఎంపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం వ్యాఖ్యానించారు. బెంగుళూరులో శనివారం జరిగిన టీడీపీ ఫోరం రాజంపేట పార్లమెంటు సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తమ నాయకుడు చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేయడంలో ఆరితేరిన విషయాన్ని తెలుగు తమ్ముళ్లు గుర్తుంచుకునేలా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈసారి ఎన్నికల కమిషన్ తెలుగుదేశం పార్టీకి చాలా అనుకూలంగా ఉంటుందన్న ఆయన, అంతటితో ఆగకుండా పోలీసులు కూడా ఈరోజు ఉన్నట్లు ఆరోజు ఉండరన్నారు. చాలామంది కిందిస్థాయి, పైస్థాయి పోలీసులతో తమ నేతలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. ఈయన మాట్లాడిన వీడియో క్లిప్పింగ్ మీడియాలో విస్తృతంగా ప్రసారమవుతోంది.

ఎస్పీకి ప్రతిష్టాత్మక అవార్డు



కడప అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల విభాగంతో పాటు దిశ, కన్విక్షన్ బెస్ట్ పోలీసింగ్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) డిస్క్ అవార్డు లభించింది. మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి నుంచి దీనిని అందుకున్నారు.

ఎస్సీలకు మేలు చేసే ప్రభుత్వం



లబ్ధిదారులకు పత్రాలను అందజేస్తున్న వెంకటసుబ్బయ్య, వినోద్‌కుమార్ తదితరులు

కడప రూరల్ : ఇది ఎస్సీలకు మేలు చేసే ప్రభుత్వం అని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హెచ్ వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో భూమి కొనుగోలు పథకం కింద భూములు పొందిన వారికి సంబంధించి తనఖా (మార్టిగేజ్)ను తొలగించిన సందర్భంగా మహిళలకు జగనన్న సంపూర్ణ భూ హక్కు పథకం ద్వారా ఆ భూములపై సర్వ హక్కులు కల్పిస్తూ పత్రాలను అందజేశారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీల అభ్యున్నతికి అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా భూమి కొనుగోలు పథకం ద్వారా భూములను పొందిన వారి ఋణ బకాయిలను మాఫీ చేయడంతో మాటు మార్టిగేజ్‌ను తొలగించడం అభినందనీయమన్నారు. దీంతో ఆ భూములపై సర్వ హక్కులు పొందిన లబ్దిదారులు ఆర్థిక ప్రగతిని సాధించాలన్నారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. ఈ ప్రభుత్వ పాలనలోనే ఎస్సీలకు మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో కే బాబు, లక్ష్మీనారాయణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మానవీయ విలువలపై సదస్సు



జేఎన్‌టీయూ విద్యార్థులతో వివిధ రాష్ట్రాల ఆచార్యులు

పులివెందుల రూరల్ : పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలలో శనివారం మావనీయ విలువలపై ముగింపు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి నిష్ణాతులైన 78మంది ఆచార్యులు హాజరయ్యారు. వసుధైక సౌభ్రాతృత్వ సమాజ నిర్వహణ, సమ సమాజాభివృద్ధిపై చర్చించారు. సమాజంలో పెరుగుతున్న ఆధునికతతో కూడిన ఎదుగుదల, సామాజిక బాధ్యతలను ఎలా అభివృద్ధి చేసుకోవాలి, విద్యార్థులను పరిపూర్ణ వ్యక్తులుగా మానవీయ విలువలతో ఎలా తీర్చిదిద్దాలి, పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి అవగాహన ఎలా పెంచుకోవాలన్న అంశాలపై ఆచార్యులు సలహాలు, సూచనలు, ఇచ్చారు. అనంతరం మానవతా విలువల రీజినల్ డైరెక్టర్ ప్రశాంతి, డాక్టర్ కుమార్ సంభవ్, డాక్టర్ వినయ్ చిద్రిలు మానవీయ విలువల గురించి చర్చించారు. కార్యకరమంలో కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పచ్చరాతలపై భగ్గుమన్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు



ఆంధ్రజ్యోతి ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం



కడప ఆంధ్రజ్యోతి కార్యాలయం ఎదుట బైఠాయించిన కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు

- ప్రొద్దుటూరు మున్సిపల్ సమావేశంలో చర్చ
- ఎమ్మెల్యేపై వ్యతిరేకత లేదని ఉద్ఘాటన
- అనంతరం జిల్లా కేంద్రంలో ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద ధర్నా
- పత్రికల దహనం



ప్రొద్దుటూరు : ఆంధ్రజ్యోతి పత్రికను పట్టుకుని మాట్లాడుతున్న కౌన్సిలర్ నూకా నాగేంద్రరెడ్డి

ప్రొద్దుటూరు/కడప సిటీ : ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు తప్పుడు రాతలు రాస్తున్నాయని.. వాటిని బహిష్కరించాలంటూ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు శనివారం ధ్వజమెత్తారు. శుక్రవారం ఓ కౌన్సిలర్ ఇచ్చిన విందుకు తాము హాజరైన విషయాన్ని వక్రీకరించి గ్రూపు రాజకీయాలు చేస్తున్నారంటూ ప్రచురించడంపై వారు భగ్గుమన్నారు.

మునిసిపల్ సమావేశంలో..

ప్రొద్దుటూరులో శనివారం నిర్వహించిన మునిసిపల్ అత్యవసర సమావేశాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించారు. కౌన్సిల్ సమావేశంలో ఇతర అంశాలతో పాటు పత్రికల్లో వచ్చిన వార్తల గురించి ప్రస్తావించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్లు ఖాజా, కౌన్సిలర్లు ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, నూకా నాగేంద్రారెడ్డి, జీలాన్ బాషా మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని దెబ్బ తీసేందుకు పచ్చ పత్రికలు వ్యూహం పన్నాయన్నారు. సహచర కౌన్సిలర్ స్నేహభావంతో విందుకు పిలిస్తే వెళ్లామే తప్ప అందులో ఎలాంటి రాజకీయం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే విజయం కోసం మరింత శ్రమిస్తామన్నారు. పార్టీని వీడే ప్రసక్తే లేదన్నారు. కనీసం తమ వివరణ కూడా తీసుకోకుండా వార్తలు రాస్తే ఎలా అని ప్రశ్నించారు. టీడీపీకి లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతోనే పచ్చ పత్రికల్లో తమ మధ్య విభేదాలు ఉన్నట్లు వార్తలు రాశారన్నారు. టీడీపీలో ఐదు గుంపులు ఉన్నాయని, వాటి గురించి ఆ పత్రికల్లో వార్తలు కనిపించలేదన్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి పేపర్లను బహిష్కరించాలని అందరినీ కోరారు.

కడపలో నిరసన

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి నియోజకవర్గంలో పెద్ద కొడుకులా ఉండి అందరి బాగోగులు చూస్తున్నారని, అలాంటి వ్యక్తిపై ఆంధ్రజ్యోతి, ఈనాడు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని ప్రొద్దుటూరు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, నాయకులు ధ్వజమెత్తారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి ఆధ్వర్యంలో చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, టీటీడీ మాజీ బోర్డు మెంబర్ మారుతిప్రసాద్, పోలీసు కంప్లయింట్ అథారిటీ మెంబర్ నాగేశారెడ్డి తదితరులతో పాటు రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు పస్నీటి కాశయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున ప్రొద్దుటూరు నుంచి దాదాపు 50 వాహనాల్లో కడపకు చేరుకుని ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద ఆయా పత్రికల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. తప్పుడు వార్తలు రాసి టీడీపీకి మేలు చేసేలా ఈ పత్రికలు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఒక కౌన్సిలర్ విందు ఏర్పాటుచేస్తే అక్కడికి వెళ్లిన ఫొటోను ఆధారంగా చేసుకుని రాచమల్లుపై అసమ్మతి అంటూ, వైఎస్సార్ సీపీలో కలకలం అంటూ తప్పుడు రాతలు రాసి ప్రజలను నమ్మించే ప్రయత్నాన్ని చేయడం సరికాదన్నారు. ఈ రెండు పత్రికలు అబద్ధాలే ఆయుధంగా చేసుకుని జర్నలిజాన్ని నడుపుతున్నాయని దుయ్యబట్టారు. ఈ రెండు పత్రికలు టీడీపీ కరపత్రాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల ముడ్డి తుడవడానికి మాత్రమే ఇవి పనికి వస్తాయని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికల తప్పుడు కథనాలపై మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించారు. ఆంధ్రజ్యోతి ప్రతులను దగ్ధం చేశారు. కార్యాలయంలోనికి చొరబడే ప్రయత్నం చేయగా, డీఎస్పీ మహమ్మద్ షరీఫ్ ఆధ్వర్యంలో సీఐలు, పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వర్తించి ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన ప్రతాప్

కమలాపురం : మండల పరిధిలోని పెద్ద చెప్పలికి చెందిన వి. గంగా ప్రతాప్ (29) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ హృషికేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. 2020లో అనంతపురం జిల్లా ముదిగుబ్బకు చెందిన ఇందుతో ప్రతాప్‌కు వివాహమైంది. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆర్థిక సమస్యల కారణంగా అప్పులు చేశాడు. అప్పుల విషయమై భార్య భర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా మృతునికి భార్యతో పాటు కుమారుడు ఉన్నారు. ప్రతాప్ ఆత్మహత్యతో కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మరణంలోనూ మరొకరికి వెలుగై..!

మదనపల్లె : మరణించిన తర్వాత విలువైన నేత్రాలను మట్టిపాలు చేసేకన్నా..దానం చేస్తే మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చనే సదుద్దేశంతో... బీజేపీ మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు రమణమ్మ(55) మృతి అనంతరం ఆమె కుటుంబ సభ్యులు నేత్ర దానం చేశారు. గుర్రంకొండ మండలం సూరప్పగారిపల్లెకు చెందిన రమణమ్మ మదనపల్లె సొసైటీ కాలనీ భాస్కర్ పాలడిపో సమీపంలో నివసిస్తున్నారు. మూడు రోజుల క్రితం ఇంట్లో హఠాత్తుగా ఫిట్స్ రావడంతో కిందపడి గాయపడ్డారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆమెను తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందే సమయంలో తాను మరణిస్తే తన కళ్లను దానం చేయాల్సిందిగా కుటుంబ సభ్యులకు సూచించారు. శనివారం ఉదయం మృతి చెందడంతో ఆమె కోరిక మేరకు కుటుంబ సభ్యులు తిరుపతి రుయా ఆస్పత్రి వైద్యులకు చెప్పి ఆమె కళ్లను దానం చేశారు. తర్వాత రమణమ్మ స్వగ్రామం సూరప్పగారిపల్లెలో అంత్యక్రియలు నిర్వహించారు.

వివాహానికి వెళ్తుండగా విషాదం


మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు


ప్రమాదానికి గురైన బస్సు


ప్రమాదానికి కారణమైన బస్సు ముందుభాగం

- రెండు బస్సులు ఢీ
- ఒకరి దుర్మరణం, 10 మందికి గాయాలు

ముద్దనూరు: తమ గ్రామానికి చెందిన అమ్మాయి వివాహ వేడుకలో పాల్గొనేందుకు బంధువులు, స్నేహితులు అంతా ఆనందంగా రెండు బస్సుల్లో బయలుదేరారు. అయితే దురదృష్టవశాత్తు వివాహానికి వెళ్తున్న రెండు బస్సుల్లో ఒక బస్సు మరో బస్సును వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ సంఘటనలో బస్సులో ఉన్న నాగసుబ్బారెడ్డి(47) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. సుమారు 10 మందికి గాయాలయ్యాయి. దీంతో వివాహ ప్రయాణం విషాదంగా మారింది.

ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల సమాచారం మేరకు కొండాపురం మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన చైతన్య అనే యువతి వివాహం శనివారం వీరపునాయునిపల్లె మండలం సగమేశ్వర దేవాలయాల వద్ద జరగాల్సి ఉండింది. దీంతో ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వధువు బంధువులు,స్నేహితులు రెండు ప్రైవేటు బస్సుల్లో ఉదయం 7గంటల సమయంలో పెళ్లికి బయలుదేరారు. మండలంలోని కమ్మవారిపల్లె గ్రామం దాటిన తర్వాత చింతకుంట సమీపంలోకి రాగానే ముందువైపు వెళ్తున్న బస్సులో ప్రయాణిస్తున్న కొంతమందిని వెనుక బస్సులోకి పంపేందుకు ముందు వెళ్తున్న బస్సును డ్రైవరు ఆపారు. బస్సును ఆపిన వెంటనే వెనుక వస్తున్న మరో బస్సు వేగాన్ని అదుపు చేసుకోలేక ముందువైపు నిలబడి ఉన్న బస్సును బలంగా ఢీకొంది. దీంతో ముందు ప్రయాణిస్తున్న బస్సులో వెనుక సీట్లలో కూర్చున్న వారు ఒక్కసారిగా బస్సులో కింద పడిపోయారు. ఈ ప్రమాదంతో ఆ ప్రాంతమంతా హాహాకారాలు మిన్నంటాయి. ఈ ఘటనలో నాగసుబ్బారెడ్డి(47)బోర్లా పడడంతో ముఖం భాగంలో తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో గాయపడిన బాలశేఖర్, ప్రసాద్, పద్మజ, రామిరెడ్డి, సుబ్బారెడ్డిలను 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. మరికొందరు ప్రైవేటు వాహనాల్లో ఆసుపత్రికి వెళ్లారు. మృతునికి భార్య, కూతురు ఉన్నట్లు తెలిసింది. ప్రధాన రహదారిలో ప్రమాదం జరగడంతో పెద్ద ఎత్తున స్థానికులు అక్కడికి చేరుకున్నారు. సీఐ నరేష్‌బాబు, ఎస్ఐ చంద్రమోహన్‌లు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పెళ్లి వేడుకకు వెళ్తూ ప్రమాదం జరగడంతో స్థానికుల్లో విషాదం అలుముకుంది.

గాయపడిన యువకుడి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని నెహ్రూనగర్‌లో విద్యుత్ తీగలు తగిలి తీవ్రంగా గాయపడిన యువకుడు గోవిందరాజు (25) కర్నూలులో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన గోవిందరాజు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 11వ తేదీన నెహ్రూనగర్‌లోని ఓ ఇంటిపైన పనిచేస్తున్న సమయంలో విద్యుత్ తీగలు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటన జరిగిన వెంటనే చికిత్సకోసం రిమ్స్‌కు పంపించారు. వైద్యుల సిఫార్సు మేరకు అతన్ని కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టపగలు చోరీ

ముద్దనూరు : స్థానిక 4 రోడ్ల కూడలి సమీపంలో పులివెందుల రహదారిలో ప్రధానరోడ్డులో తాళం వేసి ఉన్న ఇంటిలో పట్టపగలే చోరీ జరిగింది. సీఐ నరేష్ బాబు సమాచారం మేరకు ముద్దనూరుకు చెందిన విశ్వరూప ఆచారి కూతురు ప్రసవించడంతో ఇంటికి తాళం వేసి ఇంటిలోని వారంతా శుక్రవారం ప్రొద్దుటూరుకు వెళ్లారు. ఇంటిలోని బీరువాలో బంగారు నగలు ఉన్నాయి. అదే రోజు రాత్రి సమయంలో విశ్వరూప ఆచారి కుమారుడు ఇంటికి వచ్చి చూడగా ప్రధాన తలుపు తాళం పగలగొట్టి ఉంది. బీరువాలోని 8 తులాల బంగారు నగలు దొంగిలించినట్లు గుర్తించాడు. వెంటనే చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం క్లూస్ టీంతో సహా సీఐ నరేష్‌బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.జగనన్న సురక్ష ద్వారా పలు సర్టిఫికెట్లు సత్వరమే అందుతున్నాయి. నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. –సాక్షి నెట్‌వర్క్

ఒక్క రోజులోనే ధ్రువపత్రాలు



గతంలో కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే నెల రోజులు పట్టేది. నా దగ్గరకు వలంటీర్ వచ్చి వివరాలు తీసుకున్న ఒక్క రోజులోనే ధ్రువపత్రాలు వచ్చాయి. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా ఇచ్చారు. ఒకరోజు వ్యవధిలోనే నాకు ధ్రువపత్రాలు అందాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలు ఎప్పటికీ మరిచిపోలేము.

-డి.సంటెయ్య, ఆకులనారాయణపల్లె, కాశినాయన మండలం

సొంతిల్లు కట్టుకున్నాం



మాకు సొంతిల్లు కట్టుకోవాలని ఎంతో కోరిక . అయితే పేదరికం కారణంగా ఇది సాధ్యం కాలేదు. గత పాలకుల ధోరణితో ఇక జీవితంలో సొంతిల్లు కట్టుకోలేమనుకున్నాం. జగనన్న ప్రభుత్వ ఏర్పాటు కాగానే వలంటీర్ వచ్చి వివరాలు తీసుకెళ్లి ఇంటి పట్టా తెచ్చిచ్చాడు. అంతేకాకుండా ఇల్లు కూడా మంజూరు చేయడంతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి, త్వరలో సొంతింట్లోకి చేరుకుంటాం. మా చిరకాల కోరిక నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణ పడి ఉంటాం.

- పాలగిరి వెంకటసుధ, ఎర్రగుంట్ల.

అద్భుతమైన సౌకర్యాలతో విద్యాబోధన



ప్రభుత్వ పాఠశాలలు నాడు–నేడు ద్వారా కనీవినీ ఎరుగని రీతిలో అన్ని విధాలుగా అభివృద్ధి చెందాయి. తరగతి గదుల నిర్మాణం, బెంచీలు, అధునాతన టాయిలెట్‌లు, ఫ్యాన్‌లు, పౌష్టికాహార మధ్యాహ్న భోజనం తదితర అన్ని సౌకర్యాలను కల్పించారు. లక్షల రూపాయల ఫీజు కట్టే కార్పొరేట్ స్కూళ్లలో కూడా లేని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డ్స్(ఏఎఫ్‌పీ ప్యానల్స్) ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోంది. అలాగే 8, 9 తరగతుల విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులకు అత్యాధునిక వసతుల ద్వారా జ్ఞానాన్ని అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

- కె.వి.విజయమోహన్ రెడ్డి, స్కూల్‌అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్, జెడ్పీహెచ్‌ఎస్, కల్లూరు

పర్మినెంట్ లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

పీఎల్‌పీ చైర్మన్ స్వర్ణ ప్రసాద్


మాట్లాడుతున్న పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్

కడప అర్బన్ : 'ప్రతి ఒక్కరూ ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి. దీని వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది. పర్మినెంట్ లోక్ అదాలత్ తీర్పు.. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పుతో సమానం. పర్మినెంట్ లోక్ అదాలత్ (పీఎల్‌పీ) ద్వారా ఫిర్యాదుదారులు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం పొందవచ్చు'.. అని కడపలోని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కడప రిమ్స్ మెడికల్ కళాశాల సెమినార్ హాల్‌లో 'శాశ్వత లోక్ అదాలత్' ఆధ్వర్యంలో ప్రజా వినియోగిత సేవా రంగాల్లో న్యాయసేవలపై, రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, స్టాఫ్, సిబ్బంది, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ మాట్లాడుతూ పర్మినెంట్ లోక్ అదాలత్ తీర్పుకు ఎలాంటి అప్పీలు లేదన్నారు. సాధారణ లోక్ అదాలత్‌లో ఇప్పటికే ఎన్నో కేసులను పరిష్కరించామన్నారు. అయితే లోక్ అదాలత్‌లో పరిష్కారం కాని మరిన్ని సమస్యలను ఈ పర్మినెంట్ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. 8639684279, 9963731698 నంబర్లకు ఫోన్ చేసి చట్టంపై సరైన అవగాహన పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కడప రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ విజయభాస్కర్, ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు పోలియో జడ్జి భానుమతి


సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి భానుమతి

కడప అర్బన్ : కడప న్యాయవాదులు తమ దృష్టికి తీసుకుని వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు పోలియో జడ్జి భానుమతి అన్నారు. శనివారం కడపలోని జిల్లా కోర్టుకు ఆమె వచ్చారు. సాయంత్రం జిల్లా కోర్టులోని కడప బార్ అసోసియేషన్ హాల్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి మాట్లాడుతూ జూనియర్ సివిల్ జడ్జిల కొరత లేకుండా చూస్తానని చెప్పారు. హైకోర్టు జడ్జి భానుమతిని కడప బార్ అసోసియేషన్ తరఫున సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత, ఆరవ అదనపు జిల్లా జడ్జి ఇంతియాజ్ అహ్మద్, నాలుగవ అదనపు జిల్లా జడ్జి దీనబాబు, ఫస్ట్ ఏడీఎం నందిని, సెకండ్ ఏడీఎం భార్గవి, ఎక్సైజ్ కోర్టు జడ్జి హేమస్రవంతి, కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.ఎస్.బాలసుబ్రమణ్యం, ప్రధానకార్యదర్శి వై.టి.జె. కెనడీ, బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్లయ్య

కడప కార్పొరేషన్ : గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్లయ్య డిమాండ్ చేశారు. శనివారం కడప నగరంలోని రెవెన్యూ భవన్‌లో ఆ సంస్థ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న గ్రామ సర్వేయర్ల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్టా శ్రీనివాస్, శిరీష్ బాబు, జిల్లా నాయకులు శ్రీకాంత్, ప్రసాద్ రెడ్డి, శివప్రసాద్ , బాలవరదారెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన పోలీసు

కొన ఊపిరితో ఉన్న వ్యక్తిని ఆసుపత్రికి తరలించిన వైనం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి


వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్ఐ కృష్ణంరాజు నాయక్

ఎర్రగుంట్ల : చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ వ్యక్తిని సకాలంలో ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు ఎర్రగుంట్ల ఎస్ఐ కృష్ణంరాజు. వివరాలిలా.. మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామ సమీపంలో శనివారం రోడ్డు పక్కన కంప చెట్లల్లో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో పడి ఉన్నాడు. ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న ఎర్రగుంట్ల పట్టణ సీఐ ఈశ్వరయ్య వెంటనే ఎస్ఐ కృష్ణంరాజు నాయక్‌ను సంఘటన స్థలానికి పంపించారు. ఎస్ఐ అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఆ వ్యక్తి కొన ఊపిరితో ఉండటంతో వెంటనే హుటాహుటిన ఆటోను రప్పించి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లెకు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

ఉత్సాహభరితంగా టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటసుబ్బయ్య తదితరులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ప్రాంగణంలో శనివారం రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పురుషుల, మహిళల ఎంపిక ఉత్సాహ భరితంగా సాగింది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి మంజు ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. క్రీడలతో సమానంగా కెరీర్‌పై కూడా దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిహార్ స్కిల్ కంప్యూటర్స్ నిర్వాహకుడు ఇంతియాజ్, కబడ్డీ అసోసియేషన్ నాయకుడు భూమిరెడ్డి శ్రీనాథరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యుత్ వెలుగులు రాష్ట్రాభివృద్ధికి ప్రతీకలు

రాజంపేట రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో కనిపిస్తున్న విద్యుత్ వెలుగులు రాష్ట్రాభివృద్ధికి ప్రతీకలని విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.రాజశేఖరెడ్డి పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా స్థానిక డివిజన్ కార్యాలయం వద్ద నుంచి శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ విద్యుత్‌ను ఎలా పొదుపు చేయాలో అవగాహన కల్పించారు. 5 స్టార్ రేటింగ్ ఉన్న విద్యుత్ పరికరాలు మాత్రమే వాడాలని సూచించారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి


కుక్కల దాడిలో చనిపోయిన గొర్రె పిల్లలు

వేముల : మండలంలోని నల్లచెరువుపల్లె గ్రామంలో శుక్రవారం రాత్రి కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లలు మృతి చెందినట్లు బాధితుడు గంగరాజు తెలిపారు. రోజు మాదిరిగానే ఉదయం గొర్రెలు మేపుకునేందుకు తోలుకుని వెళ్లి సాయంత్రం గ్రామ సమీపంలో ఉన్న గొర్రెల దొడ్డిలో వదిలానని చెప్పారు. భోజనానికి ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేలోపే కుక్కలు దాడి చేసి 20 గొర్రె పిల్లలను చంపివేయడంతోపాటు మరో 10 గొర్రెలను గాయపరిచాయన్నారు. ఈ సంఘటనతో సుమారు రూ.1.50లక్షల మేర నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

వనిపెంటలో పులి సంచారం నిరాధారం

డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : వనిపెంట పరిసరాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్లు వచ్చిన వార్తలు నిరాధారమని తమ పరిశీలనలో వెల్లడైనట్లు డీఎఫ్ఓ పీవీ సందీప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జంతువు పాదముద్రలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను కొందరు రైతులు వనిపెంట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్‌కు పంపారన్నారు. ఈ సంఘటనపై రేంజర్ స్పందించలేదనే ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఈ విషయాన్ని నిగ్గు తేల్చేందుకు రేంజర్ కొత్తపల్లి బీట్ ఆఫీసర్, వనిపెంట సెక్షన్ స్టాఫ్, స్ట్రైకింగ్ ఫోర్స్‌లను పంపించారన్నారు. దీంతో సిబ్బంది లొకేషన్‌కు చేరుకుని సంబంధిత రైతుతో మాట్లాడి ఉదయం వరకు అక్కడే గడిపారన్నారు. సంబంధిత రైతు, ఆయన భార్య ఈనెల 11వ తేదీ రాత్రి ఆ ప్రాంతంలో బస చేశారన్నారు. జంతువు అరుపులను మాత్రమే తాము విన్నామని, భయం వల్ల ఆ జంతువును చూసేందుకు ప్రయత్నించలేదని ఆ రైతు కుటుంబం తెలిపిందన్నారు. తమ పొలాల్లో ఉన్న పాదముద్రలను మాత్రమే తాము కనుగొన్నట్లు ఆ రైతు అటవీ సిబ్బందికి తెలిపారన్నారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ స్వయంగా ఆ ప్రాంతానికి వెళ్లి రైతులను విచారించారని తెలిపారు. రైతులు కూడా తాము జంతువు అరుపులు మాత్రమే విన్నామని, పాదముద్రలు తప్ప జంతువును చూడలేదంటూ రేంజర్ వద్ద స్పష్టం చేశారన్నారు. పాదముద్రలు పరిశీలించగా జంతువు గోళ్ల ముద్రలు కూడా కనిపించాయన్నారు. దీన్ని బట్టి అది చిరుతపులి లేదా పెద్ద పులి కాదని, అడవి కుక్క, తోడేలు లేదా నక్క ముద్రలు కావచ్చన్నారు. పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసి అటవీ సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. దీన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

'ఇంటి'గుట్టు వీధికెక్కిన వేళ!

రాయచోటి : పేద, మధ్యతరగతి ప్రజలందరికీ గూడు ఇవ్వాలన్న సదుద్దేశంతో వందల కోట్ల రూపాయలను ఖర్చుచేస్తూ కాలనీలను జగనన్న ప్రభుత్వం నిర్మిస్తోంది. ఇదే అదనుగా భావించిన హౌసింగ్ అధికారులు కొంతమంది దోపిడీకి తెరలేపే కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం జిల్లా హౌసింగ్ కార్యాలయంలో ఉన్నతాధికారి ఎదుటనే వర్క్‌ఇన్‌స్పెక్టర్లు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడంతో ఇంటిగుట్టు కాస్తా రట్టయింది. ఫలితంగా వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా యత్నానికి తెగబడ్డాడు. వివరాలిలా.. శనివారం మధ్యాహ్నం హౌసింగ్ పీడీ వర్క్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీలో ఇసుక పంపిణీలో అవినీతి, అవకతవకలు జరిగాయని వర్క్‌ఇన్‌స్పెక్టర్లు హరిప్రసాద్, రమేష్ నాయక్‌లు ఒకరిపై ఒకరు పీడీకి ఫిర్యాదు చేసుకున్నారు. హౌసింగ్ పీడీ ఎదుటే వారిద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. ఈ నేపథ్యంలోనే హరిప్రసాద్ తనను బెదిరిస్తున్నాడంటూ రమేష్ నాయక్, అతని భార్యతో కలిసి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించారు. జగనన్న కాలనీలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని రమేష్ డిమాండ్ చేశారు. అనంతరం జరిగిన సంఘటనపై అతను జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకొని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. జరిగిన సంఘటనపై హౌసింగ్ పీడీ సాంబశివయ్యను వివరణ కోరగా వర్క్ ఇన్‌స్పెక్టర్ల మధ్య జగనన్న కాలనీల్లో జరిగిన అవినీతిపై గొడవ జరిగిన విషయం వాస్తవమే అన్నారు.